క్లుప్తంగా

వరద బాధితులను ఆదుకోవాలి

మామిడికుదురు: వరద బాధితులకు తక్షణ సహాయం అందించి వారిని ఆదుకోవాలని అమలాపురం పార్లమెంటు టీడీపీ ఇన్‌చార్జ్ గంటి హరీష్‌మాథుర్, జెడ్పీ మాజీ ఛైర్మన్ నామన రాంబాబు డిమాండ్ చేశారు. ముంపుబారిన పడిన అప్పనపల్లి కాజ్‌వేను టీడీపీ నేతలు ఆదివారం పరిశీలించారు. పడవలపై వస్తున్న తీర గ్రామాల ప్రజల్ని పరామర్శించారు. బాధితులకు తాగునీరు అందడం లేదని, నిత్యావసరాల కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వీటిపై ప్రభుత్వం తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు డొక్కా నాథ్‌బాబు, మొల్లేటి శ్రీనివాస్, యాలి శ్రీనివాస్, బోణం బాబు, చుట్టుగుళ్ల కిశోర్ తదితరులు ఉన్నారు.

మణిపూర్ సంఘటనపై క్రైస్తవుల ర్యాలీ



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం: మణిపూర్‌లో క్రైస్తవులపై జరిగిన దాడులను నిరసిస్తూ ఆత్రేయపురం ఓపీపీసీ చర్చి పాస్టర్ బ్రదర్ పి.రవిప్రసాద్ ఆధ్వర్యంలో ఆదివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ఎంపీపీ కుండ అన్నపూర్ణ పాల్గొని ర్యాలీని ప్రారంభించారు. స్థానిక చర్చి నుంచి ప్రారంభమైన ర్యాలీ గ్రామమంతా సాగింది. మణిపూర్ సంఘటనలను పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలతని, హింసకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నినాదాలు చేస్తూ ర్యాలీ కొనసాగింది. కార్యక్రమంలో లక్ష్మణరావు, కొమ్మురి రాజు, ఓపీపీసీ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక సత్యసాయి వ్రతాలు

మామిడికుదురు: పాశర్లపూడి శివాలయం వద్ద ఆదివారం సామూహిక సత్యసాయి వ్రతాలను ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 250 మంది భక్తులు సామూహిక సత్యసాయి వ్రతాలు ఆచరించారు. పాశర్లపూడి సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో వీటిని ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా కాకినాడకు చెందిన రఘుపతి మాస్టర్ బ్రహ్మత్వంలో పలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వ్రతాల అనంతరం ఆలపించిన ఆధ్యాత్మిక గీతాలు భక్తులను విశేషంగా అలరించాయి. భక్తులకు భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సత్యసాయి భక్తులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.10 వేల విరాళం

ఆత్రేయపురం: పురాణ ప్రసిద్ధి చెందిన ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి అన్నదాన పథకానికి గుంటూరుకు చెందిన పోలంరాజు అమరేశ్వరరావు–మాధవి దంపతులు రూ.10,116 విరాళం అందించినట్లు ఆలయ ఈఓ బి.కృష్ణచైతన్య తెలిపారు. దాతకు స్వామి చిత్రపటం, ప్రసాదాలను ఈఓ చేతుల మీదుగా అందజేశారు.

జిల్లా యువసేన అధికార ప్రతినిధిగా 'సవరపు'

అయినవిల్లి: మాదిగ రాజకీయ పోరాట సమితి జిల్లా యువసేన అధికార ప్రతినిధిగా మండలంలోని అయినవిల్లి గ్రామానికి చెందిన సవరపు వెంకటేష్ నియమితులయ్యారు. మాదిగ రాజకీయ పోరాట సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు ఆకుమర్తి చిన్న మాదిగ ఆదేశాల మేరకు ఈ నియామక ఉత్తర్వులు అందుకున్నట్లు వెంకటేష్ తెలిపారు. రాష్ట్రంలో సామాజికవర్గంతో పాటు ఉపకులాలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని వెంకటేష్ మాదిగ పేర్కొన్నారు.

కాచి చల్లార్చిన నీటినే తాగాలి

అంబాజీపేట: వరద ప్రభావిత ప్రాంతాల్లో ఉన్న ప్రజలంతా కాచి చల్లార్చిన మంచినీటినే తాగాలని సర్పంచ్ పేరాబత్తుల దొరబాబు అన్నారు. వరద ముంపునకు గురైన వాకలగరువు రజకపేట, నవుండ్రువారిపేటలలో సర్పంచ్ ఆధ్వర్యంలో సుమారు 200 మినరల్ వాటర్ బాటిళ్లను ఆదివారం పంపిణీ చేశారు. అత్యవసరమైతే తప్ప ఎవరూ వరద నీటిలో బయటకు రావద్దన్నారు. ఎవరికి ఏ సాయం కావాలన్నా తనను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు నాగాబత్తుల శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీపతి, మహిళా పోలీస్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే వాకలగరువు ఫిషర్‌మ్యాన్ పేట, నందంపూడి బొంతువారిపేటలలో మెడికల్ క్యాంపును నిర్వహిస్తున్నారు.

మాసోత్సవాలు మరో నెల రోజులు పొడిగింపు

ఆలమూరు: వరదలు, వర్షాల దృష్ట్యా డెంగీ నివారణ మాసోత్సవాల నిర్వహణను మరో నెల రోజులు పొడిగించినట్టు పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి పి.భవానీశంకర్, కమ్యూనిటీ హెల్త్ రాధాకృష్ణ, హెచ్ఈ ఏవీవీ రాజా తెలిపారు. స్థానిక పీహెచ్‌సీలో ఆదివారం వారు మాట్లాడుతూ ఈ మేరకు జిల్లా వైద్యారోగ్య శాఖ ఉత్తర్వులను వెలువరించిందన్నారు. ఆగస్టు ఒకటి నుంచి యథావిధిగా డెంగీ వ్యాధి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుని విరివిగా అవగాహన సదస్సులను ఏర్పాటు చేస్తామన్నారు. సూపర్‌వైజర్లు పీవీ రమణారావు, పి.ఉమ పాల్గొన్నారు.



అయినవిల్లిలంక వద్ద వరదనీట మునిగిన పోకతోట



పి.గన్నవరం అక్విడెక్టు వద్ద వరద ఉధృతి



నాగుల్లంకలో ఇల్లు వరద నీట మునడంతో పరుపును తరలిస్తున్న దృశ్యం



వాకలగరువు రజకపేటకు వెళ్లే ప్రధాన రహదారిలో వరద నీరు

లంకల్ని చుట్టుముట్టిన వరద

- పెరుగుతున్న వరద ఉధృతి
- ముంపు బారిన పడిన గ్రామాలు
- బోట్ల ద్వారా బాధితుల రాకపోకలు



అయినవిల్లి మండలం ముక్తేశ్వరం వృద్ధ గౌతమీపాయ వద్ద వరద ఉధృతి

మామిడికుదురు: గోదావరి వరద ఉధృతితో అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక, పెదపట్నం గ్రామాలతో పాటు పాశర్లపూడి, పాశర్లపూడిలంకలోని కొన్ని ప్రాంతాలు ముంపుబారిన పడ్డాయి. వరద పోటెత్తడంతో లంక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పాశర్లపూడిబాడవలో రిసార్ట్స్ ముంపుబారిన పడ్డాయి. పెదపట్నంలంక, పెదపట్నం గ్రామాల్లో కూరగాయల తోటలు ముంపుబారిన పడ్డాయి. రహదారులను వరద ముంచెత్తడంతో బాధితులు బోట్ల ద్వారా రాకపోకలు సాగించారు. అప్పనపల్లి, పెదపట్నంలంక, బి.దొడ్డవరం గ్రామాల్లో ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతు బజార్ల ద్వారా తక్కువ ధరలకు కూరగాయలు విక్రయించారు. ఆయా గ్రామాల్లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు సేవలందించారు. అప్పనపల్లి, పాశర్లపూడి, పాశర్లపూడిలంక గ్రామాల్లో సుమారు 450 మంది బాధితులకు ఆదివారం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు చేతుల మీదుగా ఆహార పొట్లాలను అందజేశారు. తహసీల్దార్ రియాజ్ హుస్సేన్, ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, పీహెచ్‌సీ వైద్యాధికారి కేజే ప్రశాంత్‌కుమార్‌తో పాటు పలు శాఖల అధికారులు వరద ప్రభావిత గ్రామాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు.

ఆలమూరు: మండలంలోని లంక ప్రాంతాల వెంబడి గౌతమీ గోదావరికి వరద పోటెత్తుతుంది. దీంతో నదీ పరీవాహక ప్రాంతాలైన మడికి, బడుగువానిలంక, మూలస్థాన అగ్రహారం, చొప్పెల్ల, జొన్నాడ, ఆలమూరు లంక భూముల్లో వరద నీరు వచ్చి చేరింది. మూలస్థానం అగ్రహారం ఏటిగట్టు దిగువన ఉన్న ఇటుక బట్టీలు పూర్తిగా నీట మునగడంతో అధికారులు కార్మికులను సురక్షిత ప్రదేశాలకు తరలించారు. తహసీల్దార్ ఐపీ శెట్టి, ఎంపీడీఓ కె.జాన్‌లింకన్, ఎస్సై ఎస్.శివప్రసాద్ తదితరులు మండలంలోని బడుగువానిలంకలో పర్యటించి వరద పరిస్థితిని సమీక్షించారు.

అంబాజీపేట: గోదావరి వరద ఉధృతి అంతకంతకూ పెరుగుతుండడంతో వాకలగరువులో ఫిషర్‌మెన్‌పేట వాసులు ఆందోళనకు గురవుతున్నారు. ఆదివారం గోదావరి స్థాయి మించి ప్రవహించడంతో గట్టుపై నుంచి వరద నీరు కాలనీలోకి, కొబ్బరి, అరటి తోటల్లోకి ప్రవేశించింది. వాకలగరువు, తొండవరం గ్రామాల్లోని గోదావరి ఒడ్డు, లంక భూములు జలమయమయ్యాయి. గోదావరి ఒడ్డున ఉన్న పంటలు ముంపు బారిన పడ్డాయి. నందంపూడి అప్పరకౌశిక పొంగి పొర్లడంతో గండి పడకుండా ముందస్తుగా ఇరిగేషన్, డ్రైన్స్ అధికారులు ఇసుక బస్తాలతో అడ్డుకట్ట వేశారు.

అయినవిల్లి: ముక్తేశ్వరం–అయినవిల్లిలంక వెదురుబిడెం వద్ద కాజ్‌వే వరద ఉధృతంగా ప్రవహిస్తుంది. నాటు పడవల లంక ప్రజలను అధికారులు దాటిస్తున్నారు. లంక గ్రామాల్లో పాల ఉత్పత్తులు, కూరగాయ పంటలను పడవలపై దాటిస్తున్నారు. ఎంపీడీఓ తాడి శ్రీ వెంకటచార్య, తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ వరద పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. అయినవిల్లిలంక నుంచి వీరవల్లిపాలెం వెళ్లే రహదారిపైకి వరద చేరింది. అలాగే చింతనలంక, తొత్తరమూడి, కె.పెదలంక, పొట్టిలంక, కొండుకుదురులంక గ్రామాల వద్ద రహదారులను వరద తాకింది. అధికారులు ఎప్పటికప్పుడు సహాయక చర్యలు పర్యవేక్షిస్తున్నారు. ఈ గ్రామాల్లోని పల్లపు ప్రాంతాల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలిరావాలని అధికారులు పిలుపునిచ్చారు. ముక్తేశ్వరం వృద్ధ గౌతమీపాయ వద్ద వరద ఉధృతంగా ప్రవహిస్తుంది. పలుచోట్ల కూరగాయ పంటలు, అరటి, తమలపాకు, పోక, కోకో పంటలు వరదనీటిలో చిక్కుకున్నాయి. రైతులు తమకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆందోళన చెందుతున్నారు.

తొగరపాయలో పెరుగుతున్న వరద

కొత్తపేట: గౌతమీ గోదావరి నుంచి కొత్తపేట మండలం మందపల్లి వద్ద అనుసంధానంగా ఏర్పడిన తొగరపాయ గుండా వరదనీరు ఉప్పొంగి ప్రవహిస్తోంది. మండలంలోని వాడపాలెం–వానపల్లి శివారు నారాయణలంక, కపిలేశ్వరపురం శివారు నారాయణలంక గ్రామాల మధ్య తొగరపాయపై ఉన్న వంతెనపై నుంచి ఆదివారం సాయంత్రం వరద ప్రవహిస్తోంది. రాత్రికి నీటిమట్టం ఇంకా పెరిగి వాహన రాకపోకలు నిలిచిపోతాయి. దాంతో బోట్లపై రాకపోకలు సాగించాల్సి ఉంటుంది. లంక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ జీడీ కిషోర్‌బాబు హెచ్చరించారు. వరద ప్రభావిత లంక గ్రామాల్లో ప్రజలకు ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ద్వారా తాగునీరు సరఫరా చేస్తున్నారు.

ఉధృతంగా ప్రవహిస్తున్న నదీపాయలు

పి.గన్నవరం: మండలంలోని ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, అరిగెలవారిపేట, బూరుగులంక గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోవడంతో అక్కడి ప్రజలు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. కె.ఏనుగుపల్లి, మానేపల్లి శివారు శివాయలంక, పల్లిపాలెం రహదారులపై వరద ప్రవహిస్తుండటంతో అధికారులు పడవలు ఏర్పాటు చేశారు. నాగుల్లంక శివారు గుడ్డాయలంక, ఎల్.గన్నవరం, మొండెపులంక, జొన్నల్లంక, వై.కొత్తపల్లి తదితర గ్రామాల చుట్టూ వరదనీరు చేరింది. పుచ్చల్లంకకు వెళ్లే రహదారి నీట మునిగింది. ఉభయ గోదావరి జిల్లాల సరిహద్దులో ఉన్న పెదమల్లంక, ఆనగర్లంక, అయోధ్యలంక, కనకాయలంక గ్రామాల ప్రజలు పడవలపై ప్రయాణిస్తున్నారు. మండలంలోని లంక గ్రామాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, ప్రజలకు సేవలు అందిస్తున్నారు. తహసీల్దార్ జి.రవీంద్రనాథ్ ఠాగూర్, మండల ప్రత్యేక అధికారి తిక్కా వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ ఎం.భారతి వరద ప్రాంతాల్లో పర్యటించారు. వరదలకు లంకల్లోని పంటలు నీటమునిగిని పాడైపోవడంతో నష్టాలకు గురయ్యామని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరద ముంపు గ్రామాల్లో బీజేపీ నాయకులు పర్యటించారు.

పెరిగిన వరద

సఖినేటిపల్లి: అప్పనరామునిలంకలో లోతట్టు ఏరియాలు కొత్తలంక, ఓఎన్జీసీ కాలనీ, మధ్యగ్రూపు, పల్లిపాలెం, గుబ్బలవారి మెరక పూర్తిగా వరద నీటిలో నానుతున్నాయి. ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యాన రెవెన్యూ, పంచాయతీల పర్యవేక్షణలో వరద ముంపు బాధితులకు వలంటీర్లు టిన్‌ల ద్వారా తాగు నీటిని పడవలపై సరఫరా చేస్తున్నారు. ఏపీఎస్డీఆర్ఎఫ్ బృందం సభ్యులు ముంపు ప్రాంతాల్లో పరిస్థితిని చూస్తున్నారు. సఖినేటిపల్లిలంక గ్రామ పరిధిలోని సఖినేటిపల్లి రేవు వద్ద, లోతట్టు ప్రాంతాల్లో వరద మరింత పోటెత్తింది. సఖినేటిపల్లి లాకుల వద్ద గోదావరి పాయకు చేరి ఉన్న లాకుపేట, టేకిశెట్టిపాలెం వద్ద గోదావరి పాయకు చేరి ఉన్న అగ్నికుల క్షత్రియ కాలనీ వరద ముంపులో ఉన్నాయి. సర్పంచ్‌లు పోతు దేవీదుర్గ, ఇందుకూరి సుబ్బరాజు, తదితరులు బాధితులకు సహాయం అందజేస్తున్నారు.

ముంపులో పొలాలు

రావులపాలెం: మండలంలోని పలు గ్రామాల్లో లంక పొలాలు నీటమునిగాయి. రైతులు లంక ప్రాంతాల్లో చేతికి అందివచ్చిన పంటలను నావలపై వెళ్లి గట్టు మీదకు చేరుస్తున్నారు. అలాగే మండలంలోని ఊబలంక, రావులపాలెం, కొమరాజులంక, గోపాలపురం, పొడగట్లపల్లి లంక ప్రాంతాల్లో పశువుల గడ్డి నీట మునగడంతో పశువులకు పచ్చ గడ్డి కొరత ఏర్పడింది. అలాగే పలు కూరగాయల తోటలు, వాణిజ్య పంటలు నీట మునిగాయి. ఊబలంక శివారు తోకలంక చుట్టూ వరద నీరు చేరడంతో స్థానికులు నావలపై రాకపోకలు సాగిస్తున్నారు.



జొన్నాడలో ఉధృతంగా ప్రవహిస్తున్న గౌతమీ గోదావరి



పెదపట్నంలంకలో ముంపుబారిన పడిన పందిరి బీరపాదులు



పాశర్లపూడిలో ముంపుబారిన పడిన రిసార్ట్స్



రావులపాలెం మండలం ఊబలంకలో నీట మునిగిన గోంగూర, అరటి పొలాలు



అప్పనరామునిలంకలో విధులు నిర్వహిస్తున్న ఏపీ ఎస్డీఆర్ఎఫ్ బృందంతో తహసీల్దార్ రామకుమారి



టేకిశెట్టిపాలెం ఏటిగట్టు వద్ద నుంచి పడవలపై బాధితుల ప్రయాణం



నారాయణలంకలో మినరల్ వాటర్ టిన్నులు పంపిణీ చేస్తున్న రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు



వాడపాలెం-నారాయణలంక మధ్య వంతెనపై నుంచి ప్రవహిస్తున్న వరద

ఈలకర్రలు, ఇసుక బస్తాలతో నదీకోతకు అడ్డుకట్ట



నదీకోతకు గురికాకుండా సర్వే బాదులు, ఇసుక బస్తాలు ఏర్పాటు చేయిస్తున్న అధికారులు

అయినవిల్లి: మండలంలోని కొండుకుదురులో నదీపాయ వెంబడి శీలంవారిపాలెం వద్ద ఐదు నివాస గృహాలు ఉన్నాయి. ఈ గృహాల వద్ద గోదావరి నదీపాయ ఉధృతిగా ప్రవహించడంతో కోతకు గురై నదిలో కలసిపోయే ప్రమాదం పొంచి ఉంది. దీంతో శనివారం మండలం పర్యటనలో భాగంగా కొండుకుదురు వచ్చిన జెడ్పీ ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు ఈ నదీ కోతకు గురవుతున్న ప్రదేశాన్ని పరిశీలించారు. వెంటనే స్పందించి జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లాతో ఫోన్లో మాట్లాడి విషయాన్ని తెలిపారు. ఆయన తక్షణమే హెడ్ వర్క్స్ శాఖ అధికారులకు సమస్యను వివరించారు. వెంటనే వారు సర్వే కర్రలు, ఇసుక మూటలతో నది ఒడ్డు కోతకు కాకుండా రక్షణ చర్యలు చేపట్టారు. ఈ పనులను స్థానిక జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య, తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మ, ఇరిగేషన్ శాఖ పర్యవేక్షించారు. తమ ఇల్లు నదికోతకు గురికాకుండా రక్షించిన జెడ్పీ ఛైర్మన్, జిల్లా కలెక్టర్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

జగన్ హయాంలో రోజూ పండగే



విశ్వేశ్వరాయపురంలో పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

మలికిపురం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రాష్ట్రంలో ప్రతి రోజూ పండగేనని ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు అన్నారు. ఆదివారం మండలంలోని విశ్వేశ్వరాయపురంలో రెండో రోజు గడప గడపకూ మనప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ అనేక సంక్షేమ పథకాల అమలుతో నిత్యం ప్రజలకు ఏదోక రూపేణా నగదు అందిస్తున్న ప్రభుత్వం తమదేనని అన్నారు. అందుకే రాష్ట్రంలో పండగ వాతావరణం నెలకొందన్నారు. ప్రజా శ్రేయస్సు, వారి సౌలభ్యం కోసమే సీఎం పాటు పడుతున్నారని అన్నారు. అందుకోసమే సచివాలయ వ్యవస్థతో పాటు, ఆర్బీకేల స్థాపన, జిల్లాల విభజన చేసి ప్రభుత్వ పాలన ప్రజల చెంతకు చేర్చారని ఎమ్మెల్యే అన్నారు. అంతేకాక కొత్త మెడికల్ కాలేజీలు, విద్యా పరంగా జూనియర్ కళాశాలలను ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ బల్ల ప్రసన్నకుమారి, అడబాల వీర బ్రహ్మాజీ, మాజీ ఎంపీపీ ముత్యాల కాశీ, గుబ్బల రమేష్, గుబ్బల వీవీ సత్యనారాయణ, పెయ్యల చిట్టిబాబు, దొండపాటి రాంబాబు, కొల్లాబత్తుల అశోక్‌కుమార్, యెనుముల నారాయణస్వామి, రొక్కాల వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఆర్థిక భరోసా



నగరంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ప్రభుత్వం పేదలకు ఆర్థిక భరోసా కల్పిస్తోందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. నగరంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు రూ.7.35 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ ద్వారా ఎన్నో రకాల వ్యాధులకు ప్రభుత్వం ఉచితంగా చికిత్స అందిస్తోందని చెప్పారు. ఆరోగ్యశ్రీ పరిధిలో లేని వ్యాధులకు వైద్యం చేయించుకున్న వారికి సైతం సీఎం సహాయనిధి ద్వారా ఆర్థికసాయం అందించి వారి కుటుంబానికి అండగా నిలుస్తున్నామన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు వాసంశెట్టి చినబాబు, నెల్లి దుర్గాప్రసాద్, జక్కంపూడి వాసు, చిక్కం బుజ్జిబాబు, దొమ్మేటి దుర్గారావు, నేతల నాగరాజు, కుసుమ శ్రీనివాస్, అంకాని అంజి తదితరులు పాల్గొన్నారు.

సురక్షిత ప్రాంతాలకు బాధితుల తరలింపు

రాజోలు: వరద ప్రభావిత ప్రాంతాల్లో ఉన్న బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని రాజోలు జెడ్పీటీసీ మట్టా శైలజ అన్నారు. ఆదివారం రాజోలులోని నున్న వారి బాడవ, మేకలపాలెం ప్రాంతాల్లో పార్టీ నాయకులతో కలసి ఆమె పర్యటించారు. రాజోలు నున్న వారి బాడవలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును పరిశీలించారు. నున్న వారి బాడవ, మేకలపాలెం బాధితులకు భోజనం ప్యాకెట్లను సర్పంచ్ రేవు జ్యోతి, ఎంపీడీఓ ఎం.సత్యనారాయణలు పంపిణీ చేశారు. ఎంపీటీసీ సభ్యులు కొపనాతి పుష్పలత, చెల్లింగి లక్ష్మీఈశ్వరి, మాజీ సర్పంచ్ మట్టా శాంతకుమారి, అడబాల జానకీరామ్, మట్టా ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలి

మామిడికుదురు: మణిపూర్‌లో జరిగిన దాడులు, అకృత్యాలకు సంబంధించి ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని తక్షణం బర్తరఫ్ చేయాలని వివిధ దళిత సంఘాల సమావేశం డిమాండ్ చేసింది. మామిడికుదురులో అంబేడ్కర్ యువజన సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు భూపతి వెంకటపతి అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో మణిపూర్‌లో జరిగిన మారణకాండను సమావేశం తీవ్రంగా ఖండించింది. మహిళలపై అత్యాచారం చేయడం, గృహాలు దహనం చేయడం దారుణమని వాపోయింది. దీనిపై తక్షణం విశారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. మణిపూర్‌లో పరిస్థితిని అదుపు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా వైఫల్యం చెందాయని సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది. సమావేశంలో వివిధ సంఘాల నేతలు పాల్గొన్నారు.

జిల్లా క్యాబినెట్‌లో రాజోలు రోటరీ ప్రతినిధులు

రాజోలు: రోటరీ జిల్లా క్యాబినెట్‌లోకి రాజోలు రోటరీ క్లబ్ ప్రతినిధులకు చోటు లభించింది. ఆదివారం అధ్యక్షుడు ఏడిద కవీంద్ర అధ్యక్షతన సమావేశం జరిగింది. పోలియో ప్లస్ రొటీన్ ఇమ్యూనైజేషన్ సభ్యుడిగా పాస్ట్ జిల్లా గవర్నర్ డాక్టర్ బసవా వరహాలు, రోటరీ ఫౌండేషన్ రీజినల్ సభ్యుడిగా నార్కెడమిల్లి బాలకృష్ణ, రోటరీ సభ్యత్వ రీజినల్ సభ్యుడిగా మహ్మద్ మొహిద్దీన్‌లు నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా గవర్నర్ రావూరి సుబ్బారావుకు కృతజ్ఞతలు తెలుపుతూ, నూతనంగా పదవులు పొందిన సభ్యులకు అభినందనలు తెలిపారు. క్లబ్ కార్యదర్శి చిట్నీడి లక్ష్మణరావు పాల్గొన్నారు.

ముమ్మరంగా సహాయక చర్యలు



పొట్టిలంకలో కోతకు గురవుతున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు

అయినవిల్లి: వరద ప్రభావిత ప్రాంతాల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధులు ముమ్మరంగా సహాయక చర్యలు చేపట్టారని ఉమ్మడి తూర్పుగోదావరి జెడ్పీ ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. శనివారం అయినవిల్లి మండలంలోని ముక్తేశ్వరం–అయినవిల్లిలంక వెదురుబిడెం వద్ద కాజ్‌వే, తొత్తరమూడి కె.పెదలంక, పొట్టిలంక, కొండుకుదురులంక గ్రామాల్లోని వరద పరిస్థితిని జెడ్పీ ఛైర్మన్ వేణుగోపాలరావు సమీక్షించారు. వరద బాధితుల కోసం ఏర్పాటు చేసిన ప్రభుత్వ వైద్య శిబిరాలను పరిశీలించారు. లంక గ్రామాల్లో పాడిపశువులు వరదనీటిని తాగి వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. పశువైద్యంపై అధికారులు దృష్టి పెట్టాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య, మండల ప్రత్యేక అధికారి సత్యనారాయణ, స్థానిక ఎస్సై ఎస్.నాగేశ్వరరావు, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కొనే చంద్రశేఖర్, మట్టపర్తి వెంకటరమణ, దాసరి వీరాస్వామి, కడలి భూపతిరావు తదితరులు ఉన్నారు.

పునరావాస కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

పి.గన్నవరం: వరద బాధితుల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. మండలంలోని మానేపల్లి శివారు శివాయలంక, వాడ్రేవుపల్లి, జి.పెదపూడి, కె.ఏనుగుపల్లి గ్రామాల్లో వరద ముంపు ప్రాంతాలను ఆదివారం ఆయన పరిశీలించారు. వరద బాధితులతో మాట్లాడి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరికలు



గొల్లపాలెంలో పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు

మలికిపురం: వైఎస్సార్ సీపీకి కార్యకర్తలు అంకిత భావంతో పని చేయాలని రాజోలు ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని గొల్లపాలెంలో గడప గడపకూ మన ప్రభుత్వం నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం గ్రామానికి చెందిన పలువురు టీడీపీ కార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామా చేసి వైఎస్సార్ సీపీలో చేరారు. నాగ్ల వీర వెంకట సత్యనారాయణ, తెన్నేటి బాబూరావు, ముత్యాలు, గుండుమేను శ్రీనివాసరావు, నూకేష్, చిట్టిమేను సోమేశ్వరరావు, చుట్టుగుళ్ళ నరసింహమూర్తి, చుట్టుగుళ్ళ శ్రీను, జిల్లెళ్ళ వెంకటేశ్ తదితరులు పార్టీలో చేరగా వారందరికీ ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ విజయఢంకా మోగించాలని పిలుపునిచ్చారు. ఆ దిశగా ప్రతి కార్యకర్త కూడా దృఢ సంకల్పంతో ముందుకు సాగాలని సూచించారు. ఆయా కార్యక్రమాలలో జెడ్పీటీసీ బల్ల ప్రసన్నకుమారి, మండల పార్టీ కన్వీనర్ అడబాల వీర బ్రహ్మాజీరావు, సుంకర బాబ్జి, సర్పంచ్ మందపాటి నాగేశ్వరరావు, ఎంపీటీసీ మట్ట అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మహిళకు తీవ్ర గాయాలు

కొత్తపేట: మండలంలోని ఏనుగులమహల్ గ్రామానికి చెందిన ఒక మహిళ తన మనుమరాలు మొదటి పుట్టినరోజు సందర్భంగా రాత్రి వెలిగిద్దామని ఇంట్లో నిలువ ఉన్న దీపావళి చిచ్చుబుడ్లను ఎండలో ఎండబెట్టింది. అవి ఎలా వెలుగుతున్నాయో పరీక్షిద్దామని వెలిగించగా అది ఒక్కసారిగా చీదేసి ఆమె చీర అంటుకుంది. దాంతో ఆ మంటలకు మహిళ కాళ్లు, చేతులు, నడుము భాగాలు అంటుకుని తీవ్రంగా గాయపడింది. వెంటనే ఆమెను రావులపాలెంలో ఒక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాధితురాలి స్టేట్‌మెంట్ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై శశాంక తెలిపారు.